సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం, 2, ఏప్రిల్, 2023



పంచతత్వానికి ప్రజాదరణ

జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన పంచతత్వ ఆక్యూప్రెషర్ పార్కుకు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుంది.

8లో ▶

27న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కైలాస్‌నగర్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో జి.గణపతి ప్రకటనలో తెలిపారు. జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ జనార్దన్ రాథోడ్ అధ్యక్షతన ఉదయం 10.30గంటల నుంచి నిర్వహించే సమావేశాలకు సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 / 21.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:29	సోమ : 4:46

న్యూస్‌రీల్

4న ఉచిత గుండె వైద్య శిబిరం

ఆదిలాబాద్‌టౌన్: ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో అపోలో మెడికల్ కళాశాల వారి సౌజన్యంతో ఈనెల 4న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చిన్న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. రిమ్స్ ఓపీ విభాగంలోని రెండో అంతస్తులో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వెబ్‌సైట్‌లోనూ టెన్త్ హాల్‌టికెట్లు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి కూడా హాల్‌టికెట్ పొందవచ్చని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే వారు విధిగా పలు సూచనలు పాటించాలని పేర్కొన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను వెంట తీసుకురావద్దు. అలాగే పాఠశాల యూనిఫాంతో రాకూడదు. ప్రైవేట్ యజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకుంటే BSC. TELANGANA.GOV.IN వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఉదయం 9.35గంటల తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబడదు. విద్యార్థులు ఈ విషయాలను గమనించి విధిగా పాటించాలని సూచించారు.

బాలింత మరణాల నివారణకు చర్యలు చేపట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో గర్భిణి, బాలింత మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని ట్రెయినీ కలెక్టర్ శ్రీజ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో వైద్యారోగ్య శాఖ, రిమ్స్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రసవ సమయంలో గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు జన్మనిచ్చేంత వరకు వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. రక్తహీనత, ఇతర సమస్యలతో బాధపడేవారిని ముందుగానే గుర్తించి వైద్యసేవలు అందించాలన్నారు. సమావేశంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌డబ్ల్యూవోలకు శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యసిబ్బంది పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధులు ఎలా వస్తాయి.. వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలను వివరించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ తేజ్‌కిరణ్ హాజరై అసంక్రమిత వ్యాధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

3న దివ్యాంగుల ధర్నా

ఎదులాపురం: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భావునే నగేష్ తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించకపోవడంతో ఆందోళనకు సిద్ధమయ్యామన్నారు. సోమవారం నిర్వహించనున్న ధర్నాకు జిల్లాలోని దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేశ్, ప్రమోద్ కుమార్, రాకేశ్, శంకర్ పాల్గొన్నారు.



నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా దాటుతున్న లారీలు, బస్సులు



బాదేశారు..!

- అటు టోల్.. ఇటు ఆర్టీసీ
- ఒక్కసారిగా పెరిగిన చార్జీలు
- వాహనదారులపై అదనపు భారం
- పల్లె వెలుగుకు మినహాయింపు
- దూర ప్రాంత ప్రయాణికులపై ప్రభావం

సాక్షి,ఆదిలాబాద్: టోల్ ప్లాజా చార్జీలు పెరిగాయి. ఆ వెంటనే ఆర్టీసీ సైతం అదే సాకుతో దూర ప్రాంతాలకు వెళ్లే బస్సు చార్జీలు పెంచేసింది. ఈ రెండూ శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. టోల్ చార్జీలను కేంద్ర రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ పెంచగా, బస్సు చార్జీలను ఆర్టీసీ అమలు పరిచింది. మొత్తంగా ఈ గేట్లను దాటే భారీ వాహనాల్లో ప్రయాణించే వారిపై భారం పడింది.

పరిస్థితి ఇలా..

జిల్లాలో జైనథ్ మండలం పిప్పర్‌వాడ, నేరడిగొండ మండలం రోల్ మామడ వద్ద టోల్ గేట్లు ఉన్నాయి. ప్రధానంగా జిల్లా మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు రోల్‌మామడ టోల్ ప్లాజా దాటాల్సి వస్తుంది. అదే మహారాష్ట్ర వైపు వెళ్లేందుకు పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ రెండు కూడా జాతీయ రహదారి 44పై ఉన్నాయి. జిల్లా మీదుగా ప్రతి రోజు తేలికపాటి, భారీ వాహనాలు కలిపి ఈ మార్గం గుండా వేలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా టోల్ ప్లాజా చార్జీల పరంగా స్థానిక గ్రామస్తులకు లోకల్ జర్నీ పేరిట వసూలు చేస్తుంటారు. కారుకు ఈ పెంపు నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగతా వాహనాలకు రూ.5 నుంచి రూ.20 వరకు పెంచారు. అదే విధంగా నెల కమర్షియల్ పాస్ కింద అన్ని వాహనాలకు చార్జీలను పెంచారు. స్థానిక వాహనాలకు (20 కిలో మీటర్ల లోపు) నాన్ కమర్షియల్ మంత్లీ పాస్‌పై రూ.5 పెంచారు. ప్రధానంగా ఆదిలాబాద్ నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు రోల్ మామడ టోల్ ప్లాజా మీదుగా వెళ్తాయి. ఈ మార్గంలో పలు టోల్ ప్లాజాలు ఎదురవుతాయి. దీంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులపై అదనంగా రూ.20 భారం పడింది.

ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు బస్సు చార్జీలు ఇలా.. (రూ.లలో)

బస్సు	పాతధర	కొత్తధర
లగ్జరీ	560	580
రాజధాని	690	710
గరుడ	850	870

నేరడిగొండ మండలం రోల్ మామడ వద్ద టోల్ చార్జీలు (రూ.లలో) ఇలా..

వాహనం	సింగిల్ జర్నీ		అప్‌అండ్‌డౌన్ జర్నీ	
	పాత	కొత్త	పాత	కొత్త
కారు	100	105	150	155
లైట్ కమర్షియల్	160	165	240	250
బస్సు/ట్రక్	335	350	500	525
ఎంఏవీ (మూడు చక్రాలు)	365	380	545	575
హెచ్‌సీఎం (4–6 చక్రాలు)	525	550	785	825
ఓఎస్‌వీ (6పైబడి చక్రాలు)	635	670	955	1005



స్వల్పంగానే పెంపు



టోల్ ప్లాజాల వద్ద చార్జీలు పెరిగిన నేపథ్యంలో ఆర్టీసీ ప్రయాణికులపై స్వల్పంగా చార్జీ పెంచాల్సి వచ్చింది. పల్లె వెలుగుకు మాత్రం మినహాయింపు ఇచ్చాం. ఎక్స్‌ప్రెస్ నుంచి లగ్జరీ బస్సులకు రూ. 5 నుంచి రూ. 20 వరకు పెంచడం జరిగింది.

జానీరెడ్డి, ఆర్టీసీ, ఆర్‌ఎం, ఆదిలాబాద్

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, చిత్రంలో ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, డీఈవో ప్రణీత

- కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను శనివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 3 నుంచి పరీక్షలు నిర్వహించనున్న దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, వైద్యసేవలతో పాటు బెంచీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, డీఈవో ప్రణీత తదితరులున్నారు.

టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

కైలాస్‌నగర్: జిల్లాలో గొర్రెల రవాణాకు సంబంధించిన ఈ–టెండర్ ప్రక్రియ పారదర్శకంగా నిబంధనల మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారీలు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకం కింద లబ్ధిదారుల జాబితా పరిశీలించి, అందులో ఎవరైనా మరణించి ఉంటే వారి నామిని వివరాలు సేకరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న గొల్ల, కుర్మ సంఘాలతో లబ్ధిదారుని వాటా సేకరణ కోసం షెడ్యూల్ రూపొందించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కంటి వెలుగు క్వాలిటీ కంట్రోల్ బృందాలు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఆరోగ్య మహిళ కింద అందించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల రుసుం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, ఎన్.నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కిషన్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లలు కనిపిస్తే సమాచారమివ్వాలి

ఆదిలాబాద్‌టౌన్: ఎవరైనా పిల్లలు తప్పిపోయి వచ్చినా, ఇంటి నుంచి పారిపోయి వచ్చినా, అనాథ పిల్లలేవరైనా తారసపడితే వెంటనే చైల్డ్‌లైన్ 1098కి సమాచారం అందించాలని డీసీపీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైల్వేస్టేషన్ పరిధిలో తప్పిపోయిన 18 ఏళ్ల లోపు పిల్లలు కనిపిస్తే తమకు సమాచారమందించాలన్నారు. అనంతరం చైల్డ్‌లైన్ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ సియారాం మీనా, చైల్డ్‌లైన్ జిల్లా కోఆరినేటర్ తిరుపతి, వినోద్, పద్మ, అశ్విని, స్వప్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

పంట నష్టం సర్వేలో నిబంధనలొద్దు

బోథ్: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల సర్వేను ఎలాంటి నిబంధనలు లేకుండా చేపట్టాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలంలోని టివిటిపల్లె, సొనాల, చింతల్‌బోరి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమాను అమలు చేయడం లేదన్నారు. పంట నష్టం విషయంలో 33 శాతం నిబంధన ఎత్తివేసి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు శంకర్, సదానందం, పోతన్న, గణేశ్ తదితరులున్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, పక్కన మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి

నార్నూర్: చిరుధాన్యాల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. పోషణ్ అభియాన్ పక్షోత్సవాలు పురస్కరించుకుని మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించి మాతా శిశు మరణాలు తగ్గించాలన్నారు. చిరుధాన్యాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, జీవ వైవిధ్య కమిటీ సభ్యుడు తిరుపతి, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావు దుర్గే, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, నాయకులు రాజన్న, ఫిరోజ్‌ఖాన్, హైమద్, శివాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పంట చేలకు దారివ్వాలని ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట చించోలి గ్రామస్తుల ధర్నా



ధర్నా చేస్తున్న చించోలి గ్రామస్తులు

కైలాస్‌నగర్: పంట చేలకు దారివ్వాలని డిమాండ్ చేస్తూ నేరడిగొండ మండలం చించోలి గ్రామస్తులు శనివారం ఆందోళన చేపట్టారు. ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రానికి తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద చేపట్టిన అర్బన్ పార్కు నిర్మాణంలో భాగంగా తమ పంట పొలాలకు వెళ్లే రోడ్డును అటవీ అధికారులు మూసి వేస్తున్నారన్నారు. 40 ఏళ్లుగా చేలకు వెళ్లేందుకు నాలుగు దారులు ఉండేవన్నారు. అర్బన్ పార్కు కోసమని ఇప్పటికే మూడింటిని మూసివేశారన్నారు. మిగిలిన దారిని సైతం మూసివేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి చేలకు వెళ్లేందుకు వీలుగా రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ నటరాజ్‌ను కలిసి సమస్యను విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగు, భీంరావు, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బజార్‌హత్నూర్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ రాములునాయక్ అన్నారు. మండలంలోని అనంతపూర్ గ్రామంలో ఆదివాసీ గిరిజనులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు అధికారులమని మాట్లాడేవారిని, రుణాలు ఇస్తామని చెప్పే వారిని నమ్మొద్దన్నారు. ఏ బ్యాంకు అధికారులు ఫోన్‌లో వివరాలు అడగరని తెలిపారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల సమాచారాన్ని డయల్ 100కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మొబైల్ ఫోన్‌లో ఏవైనా లింక్‌లు వస్తే ఓపెన్ చేయవద్దని, అలాగే ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సయ్యద్ ముజాహిద్, సర్పంచ్ నాగేశ్వర్, మాన్కు, గుణవంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. దొంగలు

- జిల్లాలో పెరిగిన చోరీలు
- పట్టపగలే బైక్‌పై వచ్చి చైన్‌స్నాచింగ్
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- సీసీ కెమెరాలున్నా అంతంతే
- ఆందోళనలో జనం

జిల్లాలో గతేడాది నమోదైన చోరీలు 188 చోరీలు
అపహరణకు గురైన సొత్తు రూ.85.24లక్షలు
రికవరీ అయిన మొత్తం రూ.57.61లక్షలు
ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన చోరీలు 41



ఇటీవల చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి బైక్‌పై వెళ్తుండగా సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయిన దుండగుడు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఇటీవల దొంగలు రెచ్చిపోతున్నారు. చైన్ స్నాచింగ్‌తో పాటు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఒంటరిమహిళలు, తాళం వేసిన ఇళ్లనే టార్కెట్ చేస్తున్నారు. ఒక్క జిల్లా కేంద్రంలోనే గడిచిన పది రోజుల వ్యవధిలో ఐదు ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. బైక్‌పై వస్తున్న దుండగులు క్షణాల్లో మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను లాక్కెళ్తున్నారు. తాళం వేసిన ఇళ్లలోనూ చొరబడుతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా వాటికి చిక్కకుండా కంత్రీగాళ్లు జాగ్రత్త పడుతున్నారు. కొంత కాలంగా తగ్గుముఖం పట్టిన దొంగతనాలు మళ్లీ మొదలవడంతో జనం ఆందోళనకు గురవుతున్నారు.

పగటి పూట రెక్కీలు నిర్వహిస్తూ..

ఇటీవల ఇచ్చోడ సమీపంలో ఓ దొంగల ముఠా డ్రైవర్‌ను గాయపరిచి కంటైనర్‌ను ఎత్తుకెళ్లిన విషయం విదితమే. అయితే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి స్వల్ప వ్యవధిలోనే ఈ ముఠా గుట్టు రట్టు చేశారు. ఆయా ప్రాంతాల్లో దొంగలు ఉదయం పూట రెక్కీ నిర్వహిస్తున్నారు. చిరు వ్యాపారులుగా, భిక్షాటన చేస్తూ తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తున్నారు. రాత్రి వేళలో చోరీలకు పాల్పడుతున్నారు.దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

ద్విచక్ర వాహనాలకు కరువైన రక్షణ..


జిల్లాలో బైక్ చోరీలు సైతం పెరుగుతున్నాయి. ఇటీవల ఓ పోలీసుకు సంబంధించిన బైక్‌ను సైతం ఎత్తుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా జిల్లాకేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, రిమ్స్ ఆస్పత్రిలో ఈ ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. అలాగే ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలు సైతం తెల్లారి చూసేసరికి కనబడకుండా పోతున్నాయి.

నిఘా నేత్రాలున్నా..

జిల్లా కేంద్రంలోని ఆయా ముఖ్య కూడళ్లతో పాటు కాలనీల్లో 180 వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిని పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరగడంతో ఆయాచోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. అలాంటి ప్రాంతాల్లో దొంగలను పట్టుకోవడం ఇబ్బందిగా మారుతుంది. మరోవైపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

- మార్చి 21న ఆదిలాబాద్ పట్టణంలోని మున్సిపల్ ఆడిట్ కార్యాలయంలో పనిచేసే ఓ మహిళ ఇటీవల స్కూటీపై వెళ్తున్న క్రమంలో కలెక్టరేట్ చౌక్ వద్ద ఓ చైన్ స్నాచర్ బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఘటన స్థలంలో సీసీ కెమెరాలు లేవు. అలాగే దొంగ హెల్మెట్ పెట్టుకొని ఉండడంతో పోలీసులు త్వరగా గుర్తించలేకపోతున్నారు.
- మార్చి 29న జిల్లాకేంద్రంలోని టూటౌన్ పరిధిలో గల ఖైజవాన్ నగర్‌కు చెందిన షేక్ మోయిన్ తన బంధువుతో కలిసి సాయంత్రం రైల్వేస్టేషన్ వైపు వెళ్లాడు. బైక్‌పై వచ్చిన ఓ దొంగ ఆయన జేబులో నుంచి రూ.10వేల విలువైన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు.
- వారం క్రితం పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఓ మహిళ ఉదయం 6 గంటల సమయంలో వాకింగ్‌కు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు ఆమె మెడలో నుంచి చైన్ లాగాడు. గొలుసు దృఢంగా ఉండడంతో తెగలేదు. ఆమె అరుపులతో దొంగ పరారయ్యాడు.
- జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన ఎడిపెల్లి స్వామి కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం ఊరెళ్లారు. తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసుకొని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు.
- మార్చి 29న ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలోని ఏసీఎస్ కార్యాలయం దగ్గర ఓ ఇంట్లో దొంగ చొరబడి మూడు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లాడు. ఈ కాలనీలో వీధిదీపాలు కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. సీసీ కెమెరాలు అక్కడక్కడా ఉన్నా చీకటి కారణంగా దొంగ స్పష్టంగా కనిపించని పరిస్థితి. ఇలా జిల్లాకేంద్రంలో ఇటీవల వరుస చోరీ ఘటనలు చోటు చేసుకోవడంతో జనం బెంబేలెత్తుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దీంతో చోరీలు జరిగినప్పుడు దుండగులను త్వరగా పట్టుకునేందుకు వీలు ఉంటుంది. ఇటీవల జిల్లాకేంద్రంలో బైక్‌పై వచ్చి మొబైల్ ఎత్తుకెళ్లిన దొంగను పట్టుకున్నాం. మహిళ మెడలో నుంచి చైన్ లాక్కెళ్లిన దొంగను పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నాం.

– ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎస్పీ, ఆదిలాబాద్

క్లుప్తంగా

స్వచ్ఛదూత్‌గా నవత ఎంపిక


నవత

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌కు చెందిన తన్నీరు నవత స్వచ్ఛ దూత్‌గా ఎంపిక య్యారు. రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేయగా ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆమె ఎంపికయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా హీన ఏరియా లెవెల్ ఫెడరేషన్ రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న ఆమె కర్నాటక రాష్ట్రం బెంగళూరులో గతనెల 16 నుంచి 18 వరకు జరిగిన స్వచ్ఛతోత్సవ్ కార్యక్రమానికి జిల్లా నుంచి పాల్గొన్నారు. ఢిల్లీలో గతనెల 29న జరిగిన ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో వేస్ట్‌లో తెలంగాణలోని 10 మంది సభ్యుల్లో భాగంగా నవత పాల్గొని స్వచ్ఛదూత్‌గా ఎంపికయ్యారు. ఆమె ఎంపిక పట్ల మెప్మా డీపీఎం శ్రీనివాస్, మెప్మా ఆర్పీలు హర్షం వ్యక్తం చేస్తు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఏడుగురికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఏడుగురికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆ శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి పోస్టింగ్‌లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న అడెపు మహేందర్ రిమ్స్‌కు, వెంకటరమణ రిమ్స్ కళాశాలకు, జగదీశ్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి పదోన్నతిపై బదిలీ అయ్యారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న రవీందర్ ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయానికి, రిమ్స్ నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న సందీప్‌రెడ్డికి అదే కళాశాలలో, ఇచ్చోడ పీహెచ్‌సీలో పనిచేస్తున్న జి.గోపికి డీఎంహెచ్‌వో కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే జగిత్యాల మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న టి.గోపికి రిమ్స్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించింది. వీరికి పదోన్నతులు లభించడంపై అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

కత్తి దాడిలో ఒకరికి గాయాలు

నిర్మల్‌టౌన్: తన దుకాణం ఎదుట బైక్ పెట్టవద్దని అన్నందుకు ఒకరిపై కత్తితో దాడి చేసిన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాత బస్టాండ్ ఏరియాలో అబ్దుల్ ఘనీ (45) టైలర్ దుకాణం నడుపుతున్నాడు. తన దుకాణం ఎదుట సోఫీనగర్‌కు చెందిన ఆయాన్ రెండు రోజుల క్రితం బైక్ పార్కింగ్ చేశాడు. దుకాణం ఎదురుగా బైక్ పెట్టవద్దని, తీసేయాలని అబ్దుల్ ఘనీ చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆయాన్ అతడితో గొడవకు దిగాడు. ఇది మనసులో పెట్టుకుని శనివారం సాయంత్రం దుకాణానికి వచ్చి వెనుక నుంచి కత్తితో ఘనీపై దాడి చేశాడు. స్థానికులు చూడగా అక్కడ నుంచి పారిపోయాడు. గాయాలైన ఘనీ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. ఘనీ భార్య రిజ్వానా బేగం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

పంచతత్వానికి ప్రజాదరణ


పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్స్

- ఆదిలాబాద్‌లో ఆక్యుప్రెషర్ పార్కు
- నడకకు పలువురి ఆసక్తి

ఆదిలాబాద్: పట్టణ ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం కోసమే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీపార్కులో పంచతత్వ ఆక్యుప్రెషర్ పార్కు ఏర్పాటు చేశారు. రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన పార్కులో 12 ఎంఎం, 4 ఎంఎం కంకర నల్ల రేగడి మట్టి, ఇసుక రేణువులు, గులకరాళ్లు నీటితో కూడిన వాకింగ్ ట్రాక్ సిద్ధం చేశారు. ట్రాక్‌పై చెప్పులు లేకుండా నడవడం ద్వారా అన్ని అవయవాలకు రక్తప్రసరణ జరిగి శరీరంలోని నాడులన్నీ ఉత్తేజితమవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఇది ఉమ్మడి జిల్లాలోనే తొలి పార్క్ కావడం విశేషం. ఈ పార్క్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రజల తాకిడి ఎక్కువవుతోంది. పార్కు వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని వాకర్లు చెబుతున్నారు. వారి మాటల్లోనే తెలుసుకుందాం.

యోగా సాధనకు ఏర్పాట్లు చేయాలి



పంచతత్వ పార్కును పచ్చని చెట్ల మధ్య ఏర్పాటు చేయడం వల్ల ఎంతో ప్రశాంతతను చేకూరుస్తుంది. పార్కులో నడవడంతో శరీరానికి సరైన రక్తప్రసరణ జరిగి రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఇందులో నడిచిన అనంతరం యోగా చేస్తున్నాం. పార్కు పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలంలో గడ్డిని ఏర్పాటు చేస్తే యోగా చేసుకోవడానికి వీలవుతుంది.

– అనిత, శాంతినగర్, ఆదిలాబాద్

కొత్త అనుభూతి



ప్రతిరోజు నడిచే నడక కంటే ఇందులో నడవడం వల్ల కొత్త అనుభూతి కలుగుతుంది. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. పంచతత్వ పార్కులను పట్టణంలో మరికొన్ని చోట్ల ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– శివాజీ, ఆదిలాబాద్

ట్రాక్‌పై నడవడానికి ఆసక్తి



గత మూడు నెలల నుంచి ప్రతిరోజు ఉదయం 5 నుంచి 10 రౌండ్లు వాకింగ్ చేస్తున్నా. ఈ పంచతత్వ పార్కును పంచభూతాలను థీమ్‌గా తీసుకుని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పంచ భూతాలే జీవ కోటి మనుగడకు ఆధారం. అటువంటి పార్కుకు వాకర్లు ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఈ ట్రాక్‌పై నడవడానికి ఆసక్తి చూపుతున్నారు.

– సతీశ్, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్, ఆదిలాబాద్

నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి



పార్కు నిర్వహణను మరింత పకడ్బందీగా చేపడితే వాకర్లు ఎక్కువ సంఖ్యలో రావడానికి అవకాశం ఉంటుంది. వాకింగ్ ట్రాక్‌లో నీటిని రోజు శుభ్రపరచి కొత్త నీటిని నింపితే బాగుంటుంది. రోజులుగా నీరు అలాగే నిల్వ ఉండడంతో అడుగు భాగంలో పాకురు ఏర్పడి జారిపడిపోయే అవకాశాలున్నాయి. అధికారులు దృష్టి సారించాలి.

– మహేశ్, బ్రహ్మణ్‌వాడ, ఆదిలాబాద్

అవగాహన కల్పించాలి



నా కుమారుడితో కలిసి ఈ పార్కులో నడుస్తున్నా. థీమ్ పార్కు ఏర్పాటుతో ఆరోగ్యంపైన ప్రతి ఒక్కరికి శ్రద్ధ పెరుగుతుంది. నా కుమారుడికి వ్యాయామం గురించి అవగాహన కల్పించడమే కాకుండా స్వయంగా చేయిస్తున్నా. తల్లిదండ్రులు ఈ దిశగా ఆలోచించి పిల్లలకు అలవాటు చేయాలి.

– సంజీవ్, శాంతినగర్, ఆదిలాబాద్

అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు



భైంసా: బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ ఉన్నారు. అలాగే నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ నీతూకిరణ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యం

- తెలంగాణ ప్రవాస్ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న


మాట్లాడుతున్న లక్ష్మీ ప్రసన్న

ఆదిలాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలంగాణ ప్రవాస్ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ప్రవాస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రచారం నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఒక్కరికి తెలియజేసేలా అవగాహన కల్పించాలన్నారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ధోని జ్యోతి, రాష్ట్ర నాయకురాలు చిలుకూరి జ్యోతిరెడ్డి, ఇన్‌చార్జి ఉమామహేశ్వర్‌రెడ్డి నివేదిత వజే, పద్మా గౌడ్, హరిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

సీఓఈలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్


మాట్లాడుతున్న ఎన్‌వైకే అధికారి సుశీల్‌బాద్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాలలో శనివారం జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజనులకు అవగాహన కల్పించారు. నెహ్రూ యవకేంద్ర, జిల్లా యువజన అధికారి సుశీల్‌బాద్ మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయిలో నైబర్ హుడ్ పార్లమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జీ 20 శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతుందని వివరించారు. విద్యార్థి, యువజనులకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అనంతరం యూత్‌పార్లమెంట్ నిర్వహించారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై చర్చలో విద్యార్థి, యువజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గజ్జెల్లి మోహన్, సీఓఈ అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

భీమిని: మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన మురికి కళావతి(19) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన మురికి మల్లేష్‌తో గత సంవత్సరం కళావతికి వివాహం జరిగింది. నెల రోజులుగా తల్లిగారి ఇంటికి వచ్చి ఉంటోంది. కాపురానికి వెళ్లనని తల్లిదండ్రులకు చెబుతూ ఉండేది. మనస్తాపం చెంది శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఈరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమిని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


సిడాం శ్రవణ్ మృతదేహం

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రవణ్(40) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గత నెల 26న బంధువుల వివాహానికి వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. గుర్తు తెలియని క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబీకులు బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

వివాహిత..


స్వప్న (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్‌కు చెందిన వివాహిత స్వప్న(28) చికిత్స పొందుతూ చనిపోయింది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం.. గత నెల 30న గ్రామానికి చెందిన మరో మహిళతో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి దూషించుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన స్వప్న శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగింది. కుటుంబీకులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శనివారం చనిపోయింది. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

లక్ష్మణచాంద: మతిస్థిమితం లేక ఒకరు ఇంట్లో ఉరేసుకుని మృతిచెందిన సంఘటన సోన్ మండలం కడ్తాల్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కడ్తాల్‌కు చెందిన మస్కాపురం రాము (26) గత పదేళ్ల కిందట వివాహమైంది. కుమారుడు జన్మించిన అనంతరం భార్య మృతిచెందింది. 2016 నుంచి రాము మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నారు. శుక్రవారం రాత్రి సమయంలో తల్లి అన్నం పెట్టి వెళ్లింది. తర్వాత ఇంట్లో ఒక్కడే ఉండటంతో ఉరేసుకుని మృతిచెందాడు. శనివారం ఉదయం తల్లి తలుపు తట్టగా ఎంతకు తీయకపోవడంతో కిటికీల్లోంచి చూడగా ఇనుప రాడ్‌కు వేలాడుతూ కనిపించాడు. చుట్టూపక్కల వారు తలుపులు తీశారు. తమ్ముడు భీమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగ చోరీ



నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి శివారులో గల పంటచేలలో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీ చేశారు. శనివారం ఉదయం గుర్తించిన ఆరుగురు రైతులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కలప తరలిస్తున్న కారు పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని కవ్వాల్ నుంచి అక్రమంగా కలప తరలిస్తున్న కారును శనివారం పట్టుకున్నారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హాఫీజొద్దీన్ తెలిపిన వివరాలు.. పక్కా సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి తనిఖీలు చేయగా కారులో రెండు కలప దుంగలు ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్ పారిపోయాడు. కలపతో సహా కారును సీజ్ చేసి డివిజన్ కేంద్రానికి తరలించామన్నారు. కలప విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో ప్రిన్సిపాల్ మృతి


ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కార్ల వెంకటేశ్వర్లు(56) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం ఇంటర్మీడియెట్ చివరి పరీక్ష విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో మంచిర్యాల శివారు గద్దెరాగడిలోని ఇంటికి వెళ్లాడు. ఆయన భార్య బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు శ్రీలత ఇంటికి వచ్చి చూసేసరికి పడిపోయి ఉన్నాడు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం స్వస్థలం కాగజ్‌నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

యువకుడి అదృశ్యం

లక్ష్మణచాంద: సోన్ మండలం బొప్పారానికి చెందిన అఖిలేష్ (23) కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అఖిలేష్ గత రెండు నెలల నుంచి నిర్మల్‌లోని ఓ ఫొటోషాప్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి నిర్మల్‌కు బైక్‌పై వెళ్లాడు. రాత్రి 7 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. యజమానికి ఫోన్ చేయగా అఖిలేష్ పనికి రాలేదని చెప్పారు. అఖిలేష్ ఆచూకీ కోసం బంధువులకు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. అఖిలేష్ అన్న శ్రీకాంత్ ఫిర్యాదుతో శనివారం అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ పంచాయతీ పరిధిలోని పొల్లుగూడలో శనివారం సాయంత్రం తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. సిడాం దస్రు వ్యవసాయ పనులు చేస్తుండగా ఒక్కసారిగా తెనేటీగలు దాడి చేసి గాయపర్చాయి. కుటుంబీకులు ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో మరొకరి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గత ఫిబ్రవరి 22న మహారాష్ట్రకు రెండు వాహనాల్లో 8 మంది కలిసి గంజాయి తరలిస్తుండగా మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఆ సమయంలో నలుగురిని అరెస్టు చేయగా గంజాయి కేసులో పరారీలో ఉన్న నలుగురిలో ఓ వ్యక్తిని గతనెలలో అరెస్టు చేశారు. వారిలో సద్దాం ఉస్సేన్‌ను శనివారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

లక్సెట్టిపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన రాజేందర్ (26) మృతిచెందాడు. శుక్రవారం రాత్రి దండేపల్లి మండలం చింతపల్లికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

యువత.. జర జాగ్రత్త!

- మందు, విందులతో ఎర
- తమ వెంట తిప్పుకుంటున్న నాయకులు
- నేతల ఉచ్చులో పడొద్దంటున్న మానసిక వైద్యనిపుణులు

బోథ్: ఆరే రాజు..రేపు మన పార్టీ సమావేశం ఉంది. పది మంది పోరగాళ్లను రెడీ చేయ్..ఫ్లెక్సీలు కట్టాలే..రేపటి మీటింగ్‌లో మొత్తం మనమందే ఉండాలె. మన గురించే నినాదాలు చేయాలా..ఇంటికి వచ్చి పది వేలు తీస్కపో..అని ఓ నేత నుంచి యువకుడికి ఫోన్‌చేశాడు. వెంటనే అతని ఇంటికెళ్లి డబ్బులు తీసుకుని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. మిగిలిన డబ్బులతో మందు పార్టీ చేసుకున్నారు. రాజకీయ నాయకుడి వెంట తిరగడానికి, తనకోసం జేజేలు కొట్టించడానికి, గొడవలు అయితే తన బలగం చూపెట్టడానికి యువతే కీలకం. ప్రతి విషయంలో నాయకులు, ప్రజాప్రతినిధులకు వారి అవసరం ఉంది. ఎన్నికల సందర్భాల్లో, రాజకీయ ప్రభుత్వ అధికార కార్యక్రమాలు, ర్యాలీలు, నిరసనల్లో యువతను వినియోగించుకుంటున్నారు. ఇందుకు మందు, విందులతో ఎరవేస్తూ మభ్యపెడుతున్నారు. నాయకుల వెంట తిరుగుతూ, మద్యానికి బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఎన్నికల్లో గెలిచాక వారిని పక్కన పెట్టేస్తున్నారు. పిల్లలు నాయకుల వెంబడి తిరుగుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఒక్క క్షణం ఆలోచించాలి



ప్రస్తుత రోజుల్లో నాయకుల వెంట యువత తిరుగుతున్నారు. మద్యాని బానిసై నాయకులతో తిరిగి సమయం వృథా చేసుకుంటున్నారు. తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు. ఒక్క క్షణం ఆలోచించాలి. తల్లిదండ్రులు ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత వారిపై ఉంది.

– ఓంప్రకాశ్, మానసిక వైద్య నిపుణులు

కుమారుడి భవిష్యత్ నాశనం చేస్తున్నారని..

బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఇంటర్మీడియట్ పాసై డిగ్రీలో చేరాడు. గత సర్పంచ్ ఎన్నికల్లో యువకుల అవసరం ఉందని భావించిన ఓ నేత కొంతమంది యువకులకు గాలం వేశాడు. ఎన్నికల సమయంలో ఆ యువకులను తమ వెంట తిప్పుకున్నాడు. రోజు మద్యం బాటిళ్లను అందించాడు. ఆ నేత దగ్గరకు వెళ్లవద్దని తల్లిదండ్రులు కుమారుడికి వారించినా వినలేదు. దీంతో ఆగ్రహంతో నాయకుడితో గొడవ పెట్టుకున్నారు. కుమారుడి భవిష్యత్తు నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, ఆ నాయకుని ముందు తల్లిదండ్రులు, కుమారుడు గొడవపడ్డారు. తల్లి ఏడ్చుకుంటూ వెళ్లిపోయింది.

తన వెంట తిప్పుకుని..

బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు డిగ్రీ చదువుతున్నాడు. గ్రామానికి చెందిన ఓ నేత అతన్ని దగ్గరకు తీశాడు. ఆ నేత పుట్టినరోజు సందర్భంగా సదరు యువకుడిని పిలిచి హంగామా చేయాలని చెప్పాడు. యువకుడితో అతని స్నేహితులు రాత్రంతా మేల్కొని ఫ్లెక్సీలు కట్టారు. సదరు నేత రూ.20 వేలు మందు, విందు ఏర్పాటు చేయడంతో అతని వెంట తిరగసాగారు. ఆదిలాబాద్, నిర్మల్‌తోపాటు ఆ నాయకుడు ఎక్కడి వెళ్లినా వారిని తీసుకెళ్తున్నాడు. డిగ్రీ చదివే ఆ యువకులు రోజు మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసు నమోదైనా ఏం చేయలేనని చెప్పి..

ఆదిలాబాద్ జిల్లాలోని ఓ మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి తమ వెంట యువకులను తిప్పుకుంటే తనకు పలుకుబడి పెరుగుతుందని భావించాడు. తన బంధువైన ఓ యువకుడిని అతని స్నేహితులను పిలిపించి ప్రతి రోజు మందు, బిర్యానీ ఏర్పాటు చేశాడు. సమావేశాల్లో ఆ నేత ప్రసంగిస్తున్నప్పుడు యువకులు నేత పేరుతో నినాదాలు చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆ గ్రామంలో యువకులకు కొంతమందికి గొడవ జరిగింది. దీంతో వారిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీని గురించి తమ నేతకు ఫోన్ చేసి చెబితే తాను ఏం చేయలేనని చెప్పేశాడు.